❖•❖•❖ 46 ❖•❖•❖

# మరియ చూచిన ...

*"... ఆయన తల్లియు, ఆయన తల్లి సహోదరియు, క్లోపా భార్యయైన మరియయు, మగ్దలేనే మరియయు యేసు సిలువయొద్ద నిలుచుండిరి. యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి, 'అమ్మా, యిదిగో నీ కుమారుడు!' అని తన తల్లితో చెప్పెను. తరువాత శిష్యుని చూచి, 'యిదిగో, నీ తల్లి!' అని చెప్పెను. ఆ గడియనుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను" (యోహాను 19:25-27).*

యేసు పసిబిడ్డయై పాలు త్రాగుచుండిన ప్రాయంలో ఉన్నప్పుడు, ఒక నెల రోజులకు పైబడి, ప్రవక్తయైన సుమెయోను మరియను యోసేపును సమీపించి, శిశువును తన చేతులలో ఎత్తికొని, ఒక రోజున మరియ హృదయము అత్యంత బాధకరమైన దుఃఖముచేత నలిగిపోతుందని పరిశుద్ధాత్మ చేత బయలుపరచబడిన పలుకులు పలికాడు, ఆయన, "ఇదిగో, అనేక హృదయాలోచనలు బయలుపడునట్లు, ఇశ్రాయేలులో అనేకులు పడుటకును తిరిగి లేచుటకును వివాదాస్పదమైన గురుతుగా ఈయన నియమింపబడియున్నాడు; మరియు *నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసికొనిపోవునని* ... చెప్పెను" (లూకా 2:34బి, 35; నొక్కి

చెప్పింది నాది).

ఖచ్చితంగా, యూదులలోని ప్రతి ఆడపిల్ల మెస్సీయా యొక్క తల్లియై యుండవలెనని ఆశించినది. బహుశ రాత్రివేళ పడకను సిద్ధంచేయు తన సంస్కారవిధిలో, "ప్రియమైన దేవా, నేను మెస్సీయాకు కన్నతల్లినై అల్లారు ముద్దుగా ఆయనను లాలించుచు నా చేతుల మీదుగా సాకునట్లు నీవు అనుతించుట కంటే గొప్పదైన మరొక గౌరవము గూర్చి నేను ఆలోచించలేను" అని ప్రార్థించుట ఒక భాగమై యుండి యుండవచ్చును. ఏదిఏమైనా, అతి గొప్ప అదనపు ప్రత్యేకార్హతలతోపాటు అతి గొప్ప బాధ్యతలు మాత్రమే కాదు గాని, అత్యంత తీవ్రమైన బాధ కూడా వస్తుంది. యేసు పుట్టిన కొద్ది దినములలోనే, ఆమె ఏ తల్లియైనను గౌరవింపబడని గొప్పగా గౌరవింపబడును, కానీ ఏ స్త్రీయైనను భరించని బాధలు ఆమె భరించునని కూడా మరియకు తెలియజెప్పబడినది.

సిలువకు సమీపంలోనైతేనేమి దాని చుట్టూరనైతేనేమి నిలువబడియుండినవారిలో అనేకులు యేసు వారి కొరకును మన కొరకును మరణించుచుండగా ఆయన పట్ల వారి సహానుభూతిని ఇసుమంతైనా తెలియజేసినవారు కారు. వాస్తవమునకు, వారు ఆయన దుస్థితిని చూచి దుఃఖించుటకు బదులుగా ఆయనను అపహసించుటకే వచ్చారు. వారి కళ్లయెదుటనే అమలుచేయబడుచుండిన అన్యాయము గూర్చి విలపించుటకు బదులుగా తిరస్కారముతో ఆయనపై దూషణ మాటలు పలికారు. వారు మాటలతో పొడుస్తూ కేకలతో మనస్సును గాయపర్చుచుండిన క్రూరులును దౌర్జన్యపూరితులునై యుండిరి. లోక పార భారమును ఆయన భరించుచుండగా యేసు పొందుకొనగలిగిన ఒకే ఒక ప్రోత్సాహము మరియు మృదువైన అవగాహన, స్త్రీల చిన్న గుంపొకటి మరియు ఒంటరిగా నుండిన అపొస్తలుడు, యేసు ప్రేమించిన శిష్యుని నుండి వచ్చినది (యోహాను 19:25, 26). యేసు చరిత్ర ఎప్పుడైనా రచించగల అతి గొప్ప అగ్ని పరీక్షను దాదాపుగా ఒంటరిగానే ఎదుర్కొన్నాడు.

సిలువ యొద్ద ఉండిన వారిలో, బహుశ మొదటి నుండి ఉండియుండవచ్చును, తన తల్లి మరియ ఉండింది (యోహాను 19:26, 27). యేసు సిలువ మీద వ్రేలాడుచుండిన ఆరు గంటల కాలములో మొదట్లో చాలా సేపు సిలువ పాదంలో ఉండి ఆ తరువాత కొంచెము దూరమునకు వెళ్లిపోయింది. "... అనేకమంది స్త్రీలు అక్కడ దూరమునుండి చూచుచుండిరి" అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 27:55ఎ). ప్రత్యేకించి పేర్కొనబడిన ముగ్గురు స్త్రీల పేర్లలో ఆమె పేరు లేనప్పటికిని, మరియ కూడ ఉండియుంటుందని భావింపబడినది. కాబట్టి, ఆ చిన్న గుంపు యేసు మరణమును దూరము నుండి చూచుటకు వెళ్లినప్పుడు యోహాను ఆమెను తనతో కూడ ఇంటికి తీసికొని వెళ్లాడనునది సాధ్యమే.

మరియు, మెస్సీయా తల్లి, సిలువ చెంత నిలువబడియుండగా, ఆమె ఏమి చూచింది? ఒక మాతృమూర్తి మనోభావాల్లో సిలువ రూపురేఖలు ఎలా ఉంటాయో నీవూహించుకొనగలవా?

*సిలువకు మేకులతో దిగగొట్టబడి నిటారుగా నిలువబెట్టబడిన సిలువపై వ్రేలాడుచుండుట వలన ఆమె కుమారుడు అనుభవించుచుండిన అతి తీవ్రమైన వ్యధను పుట్టించు నొప్పిని ఆమె చూచింది.* నిస్సందేహంగా, సుమెయోను పలికిన ప్రవచనము యొక్క పరమార్థము యిదే: ఒక ఖడ్గము ఆమె హృదయములోనికి దూసికొనిపోయింది. యేసు, మహోన్నతమైన భావాలలో, ఆమెకు పరిపూర్ణుడైన కుమారుడై యుండెను. ఆయన ఎన్నడు పాపము

చేయలేదు (2 కొరింథీయులకు 5:21). ఆయన నోట నుండి ఎప్పుడైనను ఎటువంటి శాపకరమైన మాటయైనను రాలేదు; ఆయన హృదయము ఎన్నడును ఒక పాపిష్టి ఆలోచనను ఆహ్వానించలేదు.

సిలువ యొద్ద, మానవుడు – అంధకారమయమైన వాని మనస్సులోని మారుమూలల్లో – రూపకల్పన చేయగల అత్యంత బాధమయమైన, బహిరంగమైన, మరియు అవమానకరమైన మరణమును ఆయన అనుభవించుట ఆమె గమనించుచుండాల్సి వచ్చింది. అప్పటికే యోసేపు పరమపదించి యుంటాడు గనుక సిలువ యొద్దకు కొందరు స్నేహితులతో కూడ వచ్చుటకు మరియ కోరుకొన్నది. మిగిలిన ఆమె పిల్లలు ఆమెతో కూడ లేరు. యోసే, సీమోను, యూదా, మరియు యాకోబు ఆమెతో కూడ రాలేదు; తమ తల్లి ఈ విషాదాంతమును వీర వనితగా వీక్షించుచుండగా వారు ఆమెను ఆలింగనము చేసికొనుటకు అందుబాటులో లేకుండిరి (మార్కు 6:3). ఇంత కంటె యింకా ఆశ్చర్యమేమంటే, ఆమెకు కలుగుచుండిన తీవ్రమైన దుఃఖమును భరించగలుగునట్లు ఆమెను ఓదార్చుటకు ఆమె కుమార్తెలు సహితము ఆమెతో కూడా రాలేదు. ఆమె హృదయము మరియు శరీరము దుఃఖసహితమైన ఇంతటి భారమును భరించుటను గమనించుట మనలను ఆశ్చర్యంతో ముంచెత్తుతుంది. ఈ కారణాన్నిబట్టే యోహాను, సిలువ మీద నుండి యేసు అతనితోను మరియతోను మాటలాడిన తరువాత, దుఃఖమును కలిగించు భయంకరమైన ఈ దృశ్యమునకు దూరముగా, మరియను ఇంటికి తీసికొనివెళ్లి యుంటాడు.

యేసు సిలువ మీద నుండి ఆమెతో మాట్లాడుట మరియకు అది ఎంతో అర్థవంతమైనదై యుంటుంది. "యేసు తన తల్లియు, తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి, 'అమ్మా, యిదిగో, నీ కుమారుడు!' అని తన తల్లితో చెప్పెను" అని యోహాను వ్రాస్తున్నాడు (యోహాను 19:26). ఆమె యేసు బాధను పంచుకొనుటకు వచ్చింది. గనుక యేసు ఆమెను *చూశాడు*. ఆయన అనుభవించుచుండిన అత్యంత బాధకరమైన ఆ వేదనను తన మనస్సులో నుండి అవతలికి నెట్టివేసి ఆయనకు జన్మనిచ్చి, ఆయనను ఎత్తుకొని, ఆయనను పుణ్యాత్ముడైన మహా పురుషునిగా తీర్చిదిద్దుచూ ప్రోత్సాహించిన తల్లి భవిష్యత్తు కొరకు సమస్తమును సమకూర్చాడు. తన తల్లికి అవసరమైన సహాయమును సమకూర్చుట యేసు నెరవేర్చిన ఇహలోక చివరి బాధ్యతయై యున్నది.

*తన కుమారుడు లోక పాపముల నిమిత్తము మరణించుట ఆమె చూచింది.* ఖచ్చితంగా, అక్కడ వాస్తవంగా సంభవించుచుండినదేమిటో మరియకు కొంత అవగాహనయై యుంటుంది. యేసు పుట్టినప్పుడు, గొఱ్ఱెల కాపరులు పశుల పాకకు వచ్చి, "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు" అని పాడుచుండిన దూతలు ప్రత్యక్షమైన సంగతిని నివేదించారు (లూకా 2:11). "అయితే మరియ ఆ మాటలన్నియు తన హృదయములో తలపోసికొనుచు, భద్రము చేసికొనెను" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 2:19). తూర్పు దేశపు జ్ఞానులు వచ్చి యేసును పూజించి, ఆయనకు బంగారము, సాంబ్రాణి, మరియు బోళము కానుకలుగా సమర్పించుట ఆమె చూచింది (మత్తయి 2:11). సుమెయోను మరియు ప్రవక్త్రియైన అన్న యేసు గూర్చి పలికిన ప్రవచనములను ఆమె విన్నది (లూకా 2:25–38). ప్రతి తల్లి పిల్లల యెడల చేయు రీతిగానే ఆమె ఆయన అద్భుతములను చూచింది (యోహాను 2:5–10), ప్రసంగములను విన్నది, ఆయన జీవితమును సూక్ష్మంగా

పరిశీలించినది. యేసునకును మతాధికారులకును మధ్య దినం ఎక్కువగుచుండిన ఉద్రిక్తతను మరియు తృణీకారమును అమె గమనించినది. ఈ విషయాలన్నిటి గూర్చి కాకపోయినా అనేక విషయాల గూర్చి ఆయనను అడిగి తెలిసికొని యున్నది, గనుక ఆమె గ్రహించగలదనియు ఆమె గ్రహించవలెననియు అని ఆయన అనుకున్న విషయాలను ఆమెకు వివరించియుంటాడు.

యేసు ఏమేమి చేయుచుండెనో మరియ వాటన్నింటిని అర్థంచేసికొని యుండకపోవచ్చును: కానీ, ఆయన సిలువను సమీపించుచుండగా, ఆయన యొక్క ప్రేషణము ఆమెకు అతి స్పష్టంగా అర్థమైయుంటుంది. ఖచ్చికంగా, గతించిన విషయాలన్నీ ఒక్కసారి గుర్తుకు రాగానే ఆమె, దేవదూత ఆమెకు ప్రత్యక్షమై మెస్సీయా ఆమె గర్భమున జన్మించునని చెప్పిన వివరమును జ్ఞాపకమునకు తెచ్చుకొనియుండును. దేవదూత మాటలు ఆమె వాటిని అపార్థం చేసికొనకుండునట్లు చాలా సూటిగా ఉండినవి:

> మరియా, భయపడకుము; దేవునివలన నీవు కృపపొందితివి. ఇదిగో, నీవు గర్భము ధరించి కుమారుని కని, ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; **ప్రభువైన** దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండును (లూకా 1:30-33).

అప్పుడామె, "ఏదో జరుగబోతుందని నాకు తెలుసు, కానీ నాకు వివరాలు తెలియలేదు. దానివలన కలుగు వేదనను మరియు అవమానమును నేనూహించుకోలేదు. ఆ ప్రవచనములన్నింటి భావాలేంటో ఇప్పుడర్థమౌతుంది" అని తనలో తాననుకొని యుంటుంది.

*యేసు ఆమెకు రక్షకుడగుట ఆమె చూచింది.* ప్రత్యక్షమైన దేవదూత, "ఇదిగో, నీవు గర్భము ధరించి కుమారుని కని, ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు" అని చెప్పాడు (లూకా 1:31). దేవదూత యోసేపుకు కలలో ప్రత్యక్షమైనప్పుడు, "ఆమె (మరియ) యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరుపెట్టుదువని" యోసేపుతో అన్నాడు (మత్తయి 1:21). యోసేపు మరియు మరియ దేవదూతలు వారికి తెలియజెప్పిన వివరాలను ఖచ్చితంగా పోల్చుకొనియుంటారు. "ఆయన తన ప్రజలను వారి పాపములనుండి రక్షించును" అను పదజాలము యొక్క భావమేమిటోయని వారు చర్చించుకొని యుంటారు.

ఆమె మరియు భూలోకమందలి సమస్త జనులు ఒక రక్షకుని కలిగియుండునట్లు యేసు మరణించుచున్నాడని ఆలోచించగలుగుట మరియకు ఎంత ఆదరణకరమైన అంశమై యుంటుంది కదా! ఆమె ఎంత వరకు అర్థంచేసికొన్నదో లేదా ఈ సత్యములలో ఎన్నింటిని ఆమె తన మనస్సులో మననం చేసికొన్నదో మనకు తెలియదు; ఏదిఏమైనా, ఆమె కొన్నింటిని జీర్ణించుకొని యేసు మరణించుట చూచుచు వాటిని తన హృదయానికి హత్తుకొనియుంటుంది.

ఆమె అర్థంచేసికొనగలిగిన ప్రతి విషయము యొక్క ప్రామాణికతను పునరుత్థానము ధ్రుధపర్చింది. శిష్యులు మేడ గదిలో కూడుకొని పరిశుద్ధాత్మ కుమ్మరింపు కొరకు ప్రార్థనాపూర్వకంగా వేచియుండినప్పుడు, మరియ అక్కడ కూడుకొని యుండిన

"120 మందిలో ఒకరై" యుంటుంది. లూకా, అపొస్తలుల జాబితాను వ్రాసిన తరువాత, "వీరందరును, వీరితో కూడ కొందరు స్త్రీలును, యేసు తల్లియైన మరియయు ఆయన సహోదరులును ఏకమనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి" అని ఆ గుంపును గూర్చి చెప్పుచున్నాడు (అపొస్తలుల కార్యములు 1:14, 15). ఇక్కడ మరియ కుమార్తెలు పేర్కొనబడకపోయినప్పటినికి, "ఆయన సహోదరులును" అను పదజాలము కుటుంబము మొత్తమును కలిపి సూచించుచున్నదై యుండవచ్చును.

మరియ మెస్సీయాకు జన్మనిచ్చిన మాట నిజమే, కానీ సిలువ యొద్ద ఆయన ఆమెకు రక్షకుడయ్యాడు, ఆమె తన పాపముల నుండి రక్షింపబడునట్లు మరణించుచుండెను. రస్సెల్ బ్రాడ్లే జోన్స్ ఈ ఆలోచనను ఉదాహరణంగా ఇలా వివరిస్తున్నాడు:

అంధత్వము ఆంగ్ల కవి జాన్ మిల్టన్‌ను (1608–1674) తన నలభైమూడేళ్ల ప్రాయంలో ఒక మరణశిక్ష వలె అలుముకొన్నదని ఆయన జీవిత చరిత్రను రచించిన రచియిత రచించాడు. గనుక అంతా అయిపోయిందనియు, జీవితంలో ఆయన సాధించాల్సింది యిక ఏమీ మిగిలియుండలేదనియు మిల్టన్ అనుకొన్నాడు. ఆయన హృదయం బ్రద్దలైపోయింది. అయితే ఆయన చూపును కలిగియున్న దినాల్లో, పార్లమెంటేరియనులకును రాయలిస్టులకును మధ్య జరిగిన ఆంగ్ల అంతర్యుద్ధముపై (1642–51) ఆయన ఒక కరపత్రమును రచించాడను వాస్తవము, అతనికి ఆదరణనిచ్చుచుండిన ఒకే ఒక విషయమై యుండినది. "పది సంవత్సరముల కంటే తక్కువ కాలములోనే ఆయన రచించిన కరపత్రము అంతర్యుద్ధమునకు సంబంధించిన మతపరమైన పురాతన చిన్న గ్రాంథాలలో కలుపబడుతుందనియు, పేరడైజ్ లాస్ట్‌ను రచించిన గ్రంథకర్త చేత వ్రాయబడియుండుటనుబట్టియే అది పేర్కొనబడుతుందనియు ఆయన ముందుగా ఊహించుకొనలేకపోయాడు" అని మిల్టన్ జీవిత చరిత్ర రచయిత వ్యాఖ్యానించాడు. అంధకారము ఒక ఆశీర్వాదమయ్యిందని రుజువయ్యింది: అదొక గొప్ప కవికి జన్మనిచ్చింది. అదే విధంగా ఒక మహాతిశయ విధానంలో, ఆమె ఒక కుమారుని కోల్పోయి తన రక్షకుని కనుగొనినప్పుడు మరియ విషయంలో కూడా ఇదే జరిగింది.[1]

మరియ నిజముగా సర్వకాలములలోని అతి గొప్ప స్త్రీలలో ఒకటై యుండినది. ఆయన ఎదుగుచుండగా యేసుకు అవసరమైయుండిన మమకారంతో నిండిన మాతృత్వమును సమకూర్చినందుకు ఆమెకు మనమెంతో కృతజ్ఞులమై యున్నాము కదా! ఆయన కుమారుని నిమిత్తము దేవునికి ఒక మంచి గృహము అవసరమయ్యింది; గనుక ఇందు నిమిత్తము ఆయన యోసేపును మరియను ఎన్నుకొన్నాడు, వారు దానిని చక్కగా సమకూర్చారు. ఏదిఏమైనా, చివరకు ఆమెకు కుమారుడుగా నుండిన యేసు ఆమెకు రక్షకుడుగా అయ్యాడని మరియ గుర్తించవలసి వచ్చింది. ఆమె తన హృదయములో తలపోసికొనుచుండిన సత్యములన్నిటి నెరవేర్పులోను "అమ్మా, ఇదిగో నీ కుమారుడు!" అని యేసు సిలువ మీద నుండి పలికిన మాటలోను ఇది జరుగుట ఆమె చూచింది (యోహాను 19:26).

❖◆❖◆❖

*మరియ "ఆమె పయనించాల్సిన మార్గము గూర్చి తన మనస్సును స్థిరంచేసికొన్నది, సరికదా ఆమె ప్రయాణం పునరుత్థాన సూర్యోదయ కిరణ కాంతిని చూచుటకు చేరుకొనక మునుపే తన కుమారుడు సిలువవేయబడిన గొల్గొతా గుండా ఆమె ప్రయాణం సాగవలసివ వచ్చినప్పటికిని ఆమె ఆ మార్గములోనే పయనించింది. విశ్వాసురాలైన తల్లి దేవుని విశ్వాసనీయతలో నమ్మకముంచుచు తన జీవితకాలమంతా*

*దేవుని ప్రేషణనే అంటిపట్టుకొని నిలిచియుంటుంది.'*[2]

---

సూచనలు

[1]Adapted from Russell Bradley Jones, *Gold from Golgotha* (Chicago: Moody Press, 1945), 51-52. [2]Eddle Cloer, *Unto Us A Child Is Born,* unpublished manuscript, 23.